క్లుప్తంగా

రైతులతో సీఎం ముఖాముఖి



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అధికారులు, రైతులు

సాక్షి నెట్‌వర్క్: పంటల సాగు కోసం వానాకాలం 2025కు సంబంధించి పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పథకం ద్వారా నిధులను విజయవంతంగా రైతుల ఖాతాలో జమ చేసిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రైతువేదికల్లో రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమం మంగళవారం ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు అధికారులు శ్రీనివాసరావు, మురళీ, జిల్లా ఉద్యాన అధికారి మరియన్న హాజరయ్యారు.

బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు విడుదల చేయాలి

మహబూబాబాద్: బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు వెంటనే విడుదల చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సాయి కుమార్, సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ.5కోట్ల నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివవర్మ, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కోసం స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు మంగళవారం తెలిపారు. అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నా.. చేసుకోకపోయినా అందరు అర్హులేనన్నారు. బైపీసీ, సీఈసీ అడ్మిషన్ల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు. ఆడపిల్లలకు హాస్టల్ వసతి సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99125 03414 సంప్రదించాలన్నారు.

వినూత్న రీతిలో విద్యను బోధించాలి

నెల్లికుదురు: తరగతి గదుల్లో విద్యార్థులకు వినూత్న రీతిలో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఎంఈఓ ఏ.రాందాస్ అన్నారు. మండలంలోని భగ్యాతండా, పీన్యాతండా ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బానోతు లక్ష్మణ్, అశోక్ ఉపాధ్యాయులు శ్రీదేవి, గీత పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి చేయూత



కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజీ)లోని జెడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడు శ్రీధర్ తన తండ్రి ఎనమనగండ్ల మల్లేశం జ్ఞాపకార్థం పాఠశాల అభివృద్ధికి రూ.10వేలను మంగళవారం హెచ్‌ఎం కె.జానయ్యకు అందించారు. కార్యక్రమంలో ఏఏపీ చైర్మన్ రాజకళ, మాజీ సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, ఉపాధ్యాయులు భద్రు, జి.యాదగిరి, స్వరణ, సురేష్, మహేష్, రమ, కమల్‌కిశోర్ పాల్గొన్నారు.

వనభోజనాల సందడి



గంపలతో వనభోజనాలకు వెళ్తున్న మహిళలు

కేసముద్రం: వరుణదేవుడా కరుణించాలంటూ గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లిన సంఘటన మండలంలోని కల్వల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎరుకల సంఘం ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి మహిళలంతా గంపలతో వెళ్లి ఊరి చివర వనంలోనే వంట చేసుకున్నారు. వనదేవుడికి నైవేద్యం సమర్పించి, సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు పండాలని పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులంతా సహపంక్తి భోజనాలు చేశారు.

ఆర్థికసాయం

గూడూరు: గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు కొమ్ముల వెంకన్న ఐదు రోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెల్సుకున్న గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ నాయిని వెంకటేశ్వర్లు బాధిత కుటుంబానికి మంగళవారం 50కిలోల బియ్యంతోపాటు ఆర్థిక సాయం అందించారు.

అద్దె భవనాల్లోనే..

కొనసాగుతున్న జీపీ కార్యాలయాలు
- ఇబ్బంది పడుతున్న అధికారులు, ప్రజలు

నర్సింహులపేట: మండలంలోని 23గ్రామాల్లో 11గ్రామ పంచాయతీలకు కార్యాలయ భవనాలు లేక అద్దె భవనాల్లో వసతుల కొరతతో ఇబ్బందులతో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పడిన పంచాయతీలు జీపీ కార్యాలయాలు లేక ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, అధికారులు కిరాయి ఇళ్లలో నడిపిస్తున్నారు. విద్యార్థులు లేక పాఠశాలలు ఖాళీగా ఉన్న నర్సింహాపురం బంజర, అమర్‌సింగ్‌తండా, గోల్‌బొడ్కతండా జీపీలు పాఠశాలల్లోనే నడుస్తున్నాయి. ఈమధ్య కాలంలో నూతనంగా గోల్‌బొడ్కతండా పంచాయతీ భవనం నిర్మించారు. గత సర్పంచ్‌ల పదవి కాలం ముగిసే చివరి దశలో జీపీ భవనాలు లేని గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద ఒక్కొక్క నూతన జీపీ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నిర్మాణాల కోసం మండలస్థాయి అధికారులు స్థలాల పరిశీలన చేశారు. నిధులు మంజూరు చేయకపోవడంతో అప్పటి సర్పంచ్‌లు పనులు చేయడంలో వెనుకంజ వేశారు. గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాక, అద్దె భవనాలకు నెలవారీగా కిరాయిలు చెల్లించడానికి నిధులు రాక సర్పంచ్‌లు చాలా ఇబ్బందులు పడ్డారు. అధికారులు నాయకులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేయాలంటే అద్దె ఇల్లు సరిపోక నానా బాధలు పడుతున్నారు. నూతన సర్పంచ్‌లు వచ్చేసరికైనా గ్రామాల్లో నూతన జీపీలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.



రూప్లాతండాలో అద్దె భవనంలో కొనసాగుతున్న జీపీ కార్యాలయం

అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాల విక్రయాలు

మహబూబాబాద్ అర్బన్: ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న గీతాంజలి స్కూల్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కేలోతు సాయికుమార్, గుగులోతు సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్కూల్‌లో ఆవరణలో నాయకులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సాయికుమార్, సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. మానుకోట జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీ విచ్చలవిడిగా పెరిగిపోయిందని, ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పుస్తకాలు అమ్ముతూ తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలను వసూలు చేస్తున్నారన్నారు. సెక్షన్–1 (సీ) ప్రకారం ఏ పాఠశాలలో సైతం పాఠ్యా పుస్తకాలు అమ్మకూడదని, విద్యాహక్కు చట్టం చెబుతున్న వాటిని తుంగలో తొక్కుతున్నారని, అట్టి పాఠశాలలపై చర్య తీసుకోవాలన్నారు. ధర్నా చేస్తున్న సంఘటన స్థలాన్ని ఎంఈఓ వెంకటేశ్వర్లు చేరుకొని పాఠ్యాపుస్తకాల దుకాణంను సీజ్ చేశారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ఐ నాయకులు శివవర్మ, దేవేందర్, జవహర్‌లాల్, వెంకటేష్, మోహన్, వినయ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



దుకాణం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఇరాన్‌పై యుద్ధాన్ని ఖండించండి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఇరాన్‌పై అమెరికా యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో దాడులను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ట్రంప్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, చిన్న చంద్రన్న, పెరుగు కుమార్, మదార్ మాట్లాడుతూ.. ఇరాన్‌పై ఆమెరికా, ఇజ్రాయేల్ దాడులు నిలిపివేయాలన్నారు. రెండు వారాల్లో శాంతి చర్చలు చేస్తామని మాటలు చెప్పి ఇరాన్‌పై యుద్ధం చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రవణ్, హలావత్ లింగ్యా, సామ పాపయ్య, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, దుడ్డెల రామ్మూర్తి, కొత్తపల్లి రవి, సూరి పాల్గొన్నారు.

గూడూరు: ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న క్రూరమైన దాడులను ప్రతీ ఒక్కరు ఖండించాలని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జ్ గోనె కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కంచ వెంకన్న, నూకల ఉపేందర్‌యాదవ్, ఈసం రామయ్య పాల్గొన్నారు.

రేపు సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ

మహబూబాబాద్ రూరల్: సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ ఈనెల 26వ తేదీ గురువారం జరుగనుందని సంఘం నాయకులు బోడ సుమన్ నాయక్, భూక్య రాంజీనాయక్, భూక్య రవినాయక్ తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామ శివారు భజన తండాలోని సేవాలాల్ దేవాలయం వద్ద సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న బంజారాలకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, ఇతర రంగాల బంజారాలు నిరాదరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడ గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుగులోత్ వీరన్న, భూక్య చిన్న, భద్రు, హరినాయక్, రమేష్ నాయక్, కేసునాయక్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

పెద్దవంగర: విద్యార్థుల చదువులకు సరస్వతి దేవి అనుగ్రహం తోడై ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ ఆకాంక్షించారు. అయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా తరుణి ఆధ్వర్యంలో మాధవ పెద్ది వాణి చొరవతో మణి మన్మోహన్ రెడ్డి దంపతులు రూ.12వేల సొంత ఖర్చులతో మంగళవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి, లొట్లబండతండా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లతోపాటు పలకలు పంపిణీ చేశారు. పోచారం ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, హెచ్‌ఎంలు రవీందర్ రెడ్డి, బాలరాజు, మహి, మురళీ, క్లబ్ ప్రతినిధులు శైలజ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. భార్యాభర్తలకు తీవ్రగాయాలు

కురవి: ఆటో బోల్తా పడిన ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని రాజోలు–బలపాల గ్రామాల మధ్య డోర్నకల్ ప్రధాన రహదారిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బలపాల గ్రామానికి చెందిన గీసగాని ఉపేందర్, అతడి భార్య కవిత సొంత ఆటోలో మానుకోటకు వెళ్లి సొంత పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి బయలుదేరారు. రాజోలు శివారులోని మలుపు వద్ద ఆటో అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉపేందర్–కవితలు పడిపోయారు. దీంతో ఉపేందర్‌కు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. కవితకు కాలు, చేతి విరిగాయి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయాని 108లో మానుకోటలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను పైలట్ జక్కుల వీరన్న, ఈఎంటీ బంగారి సకాలంలో ఆసుపత్రికి తరలించారు.



రోడ్డు పక్కన గాయాలతో భార్యాభర్తలు

మట్టి తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధి అంబేద్కర్ సెంటర్‌లో గల రైల్వే అండర్ డ్రైయినేజీ మార్గంలో రాకపోకలకు అడ్డుగా ఉన్న మట్టిని జేసీబీ సాయంతో, రాళ్లను, చెత్తా చెదారాన్ని మున్సిపల్ సిబ్బంది మంగళవారం తొలగించారు. దీనిపై ఈనెల 13న 'సాక్షి' దినపత్రికలో'పనుల్లో జాప్యం' అనే శీర్షిక ప్రచురితమైంది. ఈమేరకు రైల్వే అండర్ డ్రైయినేజ్ నిర్మాణం పనులను వేగవంతం చేశారు. దీంతో బాటసారులు ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు.



మట్టిని తొలగిస్తున్న జేసీబీ

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ

కురవి: సీరోలు మండలం రేకుల తండా గ్రామంలో సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను, రైతుకు చెందిన వ్యవసాయ బావిలోని విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. తండావాసులు కథనం ప్రకారం.. రేకులతండా శివారు మాన్‌సింగ్‌తండా సెంటర్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్‌ను ఎత్తుకెళ్లారు. అలాగే తండాకు చెందిన తేజావత్ ఖాసీంకు చెందిన వ్యవసాయ బావిలోని విద్యుత్ మోటార్‌ను అపహరించారు. ఈసంఘటనపై విద్యుత్ శాఖ అధికారులు, రైతు సీరోలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు తేజావత్ కిరణ్‌కుమార్, బాలు, నరేష్, బానోత్ రవి, బగ్గు, అశోక్, లింగ, బాలాజీ కోరారు.

టీపీఓపై చర్య తీసుకోవాలి

దోర్నకల్: తమ వెంచర్‌లోని రోడ్లను ధ్వంసం చేసిన టౌన్ ప్లానింగ్ అధికారిపై చట్టపరంగా చర్య తీసుకోవాలని అమ్మపాలెంకు చెందిన చిర్రా వీరభద్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తాము తంపుబావితండాలో 3.6 ఎకరాల భూమిలో నిబంధనల ప్రకారం వెంచర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంచర్ చట్టపరంగా కావాల్సిన అనుమతులన్ని పొంది ప్లాట్లతోపాటు అవసరమైన రోడ్లను ఏర్పాటు చేశామన్నారు. కొద్ది రోజులు టౌన్ ప్లానింగ్ అధికారి వెంచర్‌కు అనుమతులు లేవంటూ మధ్యవర్తి ద్వారా డబ్బు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. మంగళవారం డోజర్‌తో వెంచర్‌లోని రోడ్లను ధ్వంసం చేసి తమకు నష్టం కలిగించాడని తెలిపారు. వెంచర్‌లోని రోడ్లను ధ్వంసం చేసి ఇబ్బందులకు గురి చేస్తున్న టీపీఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీరభద్రం కోరారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్: మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యమని మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మానుకోట రూరల్ పోలీసులు ఆధ్వర్యంలో మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ఎస్టీ బాలుర వసతి గృహంలో మంగళవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా దీపికరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అందమైన జీవితాన్ని గడపాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని, కష్టపడి చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రమేష్, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్‌రెడ్డి, సిబ్బంది సంపత్, అశోక్, హాస్టల్ వార్డెన్ యాకూబ్, ఏఎన్ఎం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై దీపికరెడ్డి

'రైతుభరోసా'పై సంబురాలు



మహబూబాబాద్ రూరల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



దంతాలపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



కొత్తగూడ: టపాసులు కాలుస్తున్న నాయకులు



తొర్రూరులో..

రైతు భరోసా సంబురాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. - సాక్షి నెట్‌వర్క్

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

తొర్రూరు: సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలని శివయాద్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు నడిగడ్డ శైలజ అన్నారు. స్థానికురాలు నడిగడ్డ శివాని జయంతి సందర్భంగా శివయాద్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని దుబ్బతండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శైలజ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, హెచ్‌ఎం ఒరుగంటి చైతన్య, ఉపాధ్యాయుడు ఇట్టె ప్రేమ్‌చందర్‌రెడ్డి, పాఠశాల చైర్‌పర్సన్ కమలమ్మ, సీఆర్పీ కల్పన, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

దోర్నకల్: దోర్నకల్ మీదుగా నడిచే పలు ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్‌యూసీసీ సభ్యులు లచ్చిరాంనాయక్ కోరారు. మంగళవారం సికింద్రాబాద్ రేల్ నిలయంలో డీఆర్‌ఎంతోపాటు పలువురు రైల్వే ఉన్నతాధికారులను కలిసి లచ్చిరాం దోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. పలు రైళ్లకు హాల్టు కల్పించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందించారు.

ముట్టడిని జయప్రదం చేయండి

బయ్యారం: బయ్యారం పెద్దచెరువుకు గోదావరి జలాలు తీసుకురావాలని కోరుతూ ఈనెల 26న వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న తహసీల్దార్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. మంగళవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాయకులు రాజన్న, భిక్షం, మదార్, సూర్యం, శ్రీను, వీరభద్రం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వెంచర్‌కు అనుమతి లేదు

దోర్నకల్: స్థానిక పంపుబావితండాలో ఏర్పాటైన వెంచర్‌కు అనుమతులు లేవని టౌన్ ప్లానింగ్ అధికారి రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంచర్‌కు అనుమతులు లేనందున ప్రధాన ద్వారం వద్ద రోడ్డును తొలగించామని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీయూసీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నిక

నెహ్రూసెంటర్: ట్రేడ్ యూనియన్స్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జిల్లాకు చెందిన కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం ఎన్నికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల్లో ఎన్నుకున్నారు.

కార్మికులకు అండగా ఏఐసీటీయూ..

మహబూబాబాద్ రూరల్: కార్మికుల పక్షాన నిలిచి వారి హక్కుల సాధన కోసం ఏఐసీటీయూ కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తుందని జిల్లా కార్యదర్శి మద్రిపెల్లి మొగిలి అన్నారు. జిల్లా కేంద్రంలోని 20 మంది కార్మికులు మంగళవారం సంఘంలో చేరారు. కార్యక్రమంలో జాటోత్ బిచ్యానాయక్, కార్మికులు బోడ చందు, బానోతు రవి, అజ్మీరా రమేష్, మాలోతు రవి, భద్రు పాల్గొన్నారు.

మతోన్మాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజం

కేసముద్రం: బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాదానికి, ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని పెద్దమోరితండాజీపీ శివారు కొత్తూరులో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ పాల్గొన్నారు.

ప్రజల్లోకి మోదీ పథకాలు



దోర్నకల్: పదకొండేళ్ల బీజేపీ పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుగులోత్ దేవానాయక్ తెలిపారు. పట్టణంలో మంగళవారం మోదీ అమలు చేసిన పథకాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు వేణుకృష్ణ, హతిరాంనాయక్, బాబురావు పాల్గొన్నారు.

మాలమహానాడు కోశాధికారిగా కనకయ్య

దోర్నకల్: మాలమహానాడు మండల కోశాధికారిగా వెన్నారం గ్రామానికి చెందిన కొప్పుల కనకయ్య నియమిస్తూ మండల ఉపాధ్యక్షుడు పగిడిపల్లి వీర్రాజు ప్రకటించారు.

'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలి

గార్ల/బయ్యారం: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మావోయిస్టులను శాంతిచర్చలకు పిలవాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి సక్రు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గార్లలో జరిగిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు వరంగల్‌లో నిర్వహించే న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర స్థాయి సదస్సులో మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాధ, శారద, భారతి, లక్ష్మయ్య, సుమన్, వి సక్రు, రాందాస్ పాల్గొన్నారు.


దళిత జర్నలిస్టు అధ్యక్షుడిగా వెంకటేష్

గూడూరు: మండల కేంద్రంలో మంగళవారం దళిత జర్నలిస్టుల ఐక్యవేదిక సమావేశం జిల్లా కన్వీనర్ కట్కూరి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మండల దళిత జర్నలిస్టుల ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడిగా ఎల్లంకి వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాఠశాల తనిఖీ

దంతాలపల్లి: వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందాల్సిన పాఠ్యపుస్తకాలు, ఇతర సదుపాయాలపై ఆరాతీశారు. వసతి గృహాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామ్‌సింగ్, వార్డెన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైండోవర్



మహబూబాబాద్ రూరల్: శాంతిభద్రతల విఘాతం కలిగిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు రౌడీషీటర్లు, మరో ఆరుగురు నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఇద్దరు రౌడీ షీటర్లు బొజ్జ మల్లేష్, చింతరెడ్డి మురళీతోపాటు జిల్లా కేంద్రంలో జరిగిన ఓ ఘర్షణ కేసులో ఓ యువకుడిపై దాడిచేసి గాయపరిచిన నిందితులు పులిగిల్ల చిరంజీవి, రేసు నవీన్, సంద విగ్నేష్, లక్ష్మణ్, సాయి, రాకేష్ తదితరులను బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజీ) శివారు పెద్దతండాలో గుగులోత్ మోతీలాల్ అనే వ్యక్తికి చెందిన రేకుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం రాత్రి దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మోతీలాల్ తాత్కాలికంగా రేకుల ఇంటిని నిర్మించుకున్నాడు. సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఇంట్లో ఉన్న సామగ్రి, ఫ్రిజ్, దుస్తులు, రూ.2లక్షల నగదు, బియ్యం, వంటసామగ్రి కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు రూ.5లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



కాలిపోయిన ఇంటి ఎదుట మోతీలాల్ దంపతులు